క్లుప్తంగా...

రక్తదానం చేసిన విద్యార్థులు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నాగరాజు నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఘట్‌కేసర్ నగర కార్యదర్శిగా భాను



ఘట్‌కేసర్ నగర ఏబీవీపీ కార్యదర్శితో నూతన కమిటీ సభ్యులు

ఘట్‌కేసర్: ఏబీవీపీ ఘట్‌కేసర్ నగర కార్యదర్శిగా వరుసగా రెండోసారి భాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో శనివారం నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో సంయుక్త కార్యదర్శులుగా ఎ.శివ, అఖిల్, శివ, ఉపేందర్, ఉపాధ్యక్షులుగా ఓంకార్, లోకేశ్, కిరణ్, వినయ్, కార్యవర్గ సభ్యులుగా భరత్, కె.శివ, కార్తీక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, అధిక ఫీజుల దోపిడీపై నిరంతరం కృషి చేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దు



నేరస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: దసరా పండగ, ఎన్నికల నేపథ్యంలో ఎవరు గొడవలు పెట్టుకోవద్దని, శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం అన్నారు. జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ప్రమేయం ఉన్న 14 మందిని శనివారం కాప్రా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇప్పటికే జవహర్‌నగర్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న 150 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

యాప్స్‌తో.. అన్నీ ఈజీగా..

- సువిధ యాప్‌తో ఎన్నికల సభలకు అనుమతులు
- ఎన్నికల ఘటనలపై ఫిర్యాదులకు సీ–విజిల్ యాప్
- జిల్లా ఎన్నికల అధికారి, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, ఇంటింటి ప్రచారం, బ్యానర్లు, భారీకేడ్లు, పార్టీ ఫ్లాగ్స్‌కు సంబంధించిన అనుమతులు పొందవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

- నామినేషన్ల ప్రక్రియ నవంబరు 3 నుంచి ప్రారంభమవుతుందని, ఈ నామినేషన్ల ప్రక్రియలో గుర్తింపు పొందిన, రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుంచి మొదలుకొని శాసనసభ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థుల వరకు సులభమైన పద్ధతిలో 'సువిధ యాప్ష్ ద్వారా అనుమతులు తీసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మీటింగ్, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎలక్షన్ ఆఫీస్, లౌడ్ స్పీకర్, ఇంటింటి ప్రచారం, బ్యానర్లు, బారికేడ్లు, ఫ్లాగ్స్ అనుమతులను 48 గంటల్లో కల్పించేందుకు ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించిందని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా అనుమతి పొందిన 72 గంటల పాటు వాలిడిటీ ఉంటుందన్నారు.

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదులకు సీ–విజిల్

- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సమయంలో అక్రమాలు, డబ్బు తరలింపు, ఎన్నికలకు విరుద్ధంగా జరిగే ఘటనలపై ఫిర్యాదు చేయడానికి సీ- విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ-విజిల్ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.
- ఈ యాప్ ఎన్నికల సమయంలో మద్యం, డబ్బులు పంపిణీ, ఇతరతర అక్రమాలకు పాల్పడుతున్న వారీ ఫొటోలతో సహా ఇతర విషయాలకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ఉన్నా.. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.
- ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం, నేరపూరిత చర్యలకు పాల్పడటం, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రవాణా చేసినా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు మించి డబ్బులు ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు, ఫేక్ న్యూస్(నకిలీ వార్తల)కు సంబంధించిన ఫిర్యాదులతోపాటు తాజాగా తీసిన ఫొటోలు, వీడియోల ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.
- బహిరంగ ప్రదేశాల్లో నాయకులతో కూడిన ఫ్లెక్సీలు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధుల ఫొటోలు వంటి కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే వాటిని కూడా యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఐదు నిమిషాలలో జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో ఉండే మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని తెలిపారు.
- ఈ ఫిర్యాదులను ఐదు నిమిషాలలోగా క్షేత్ర పరిశీలన అధికారి ఎంసీసీ, ఎఫ్ఎస్టీ వారికి విచారణ నిమిత్తం పంపిస్తామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేసి, 30 నిమిషాల్లో నివేదికను జిల్లా అధికారి పంపిస్తారని తెలిపారు.
- రిటర్నింగ్ అధికారి యాభై నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని వివరించారు.
- ఫిర్యాదుకు సంబంధించి చర్యలు తీసుకోలేకపోతే ఆ ఫిర్యాదు మూసివేస్తామని, ఒకవేళ రిటర్నింగ్ అధికారి పరిధిలో కాకపోతే తదుపరి చర్య నిమిత్తం జిల్లా ఎన్నికల అధికారికి పంపిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీ-విజిల్ 24 గంటల పర్యవేక్షణలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలు, ఓటర్లు సీ- విజిల్ యాప్ వినియోగించుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులకు సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.

శరవేగంగా సీఎం సభకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో ఈ నెల 18న సీఎం కేసీఆర్ బహిరంగ సభ సందర్భంగా శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే సభా ప్రాంగణాన్ని పూర్తిగా చదును చేయగా శనివారం పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశం, సభాస్థలికి చేరుకునే తీరు, పార్కింగ్ ప్రదేశాలను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పరిశీలించారు. సభాస్థలి వద్ద మంత్రి తనయులు నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, యువ నాయకులు భద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు రాజమల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాగ్యారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సభను విజయవంతం చేయాలి.. మంత్రి మల్లారెడ్డి

సీఎం సభలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసేలా నాయకులు చొరవ చూపాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సభా ప్రాంగణం వద్ద శనివారం తూంకుంట మున్సిపాటీ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమై వారికి పలు ఆదేశాలు, సూచనలు చేశారు. సభ విజయవంతం అయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

యువత సహనం కోల్పోవద్దు..

- క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దు..
- నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి: ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తోందని, గ్రూపు–2 పరీక్ష వాయిదా వేసినందుకే రెండేళ్లుగా హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఉంటూ పరీక్షకు సిద్ధమవుతున్న ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి విద్యార్థిని బలయ్యిందన్నారు. తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తానని చెప్పి రాష్ట్రంలోని 40 లక్షల మంది నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని అన్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత అసహనానికి గురై ఆత్మహత్యలకు పాల్పడొద్దని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్యాకేజీలపై కాకుండా నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి



లక్డీకాపూల్: యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలని అపోలో గ్రూప్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.హరిప్రసాద్ అన్నారు. ఉద్యోగాలను కోరే వారిగా కాకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారేలా వారిని ప్రోత్సహించాలన్నారు. శనివారం విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాన్వొకేషన్ 2023 నిర్వహించింది. క్యాంపస్ ఆటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రిపబ్లిక్ ఆఫ్ కొరియా కౌన్సిల్ జనరల్ సురేష్ చుక్కపల్లి మాట్లాడుతూ.. ప్యాకేజీలపై కాకుండా విధేయతతో తమ నైపుణ్యాన్ని పెంపొందించడంలో దృష్టి పెట్టాలని, ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. తొలుత డిప్లొమా పొందేందుకు అర్హత సాధించిన 223 మంది విద్యార్థుల జాబితాను అకాడమిక్ హెడ్ డాక్టర్ ఎస్ఆర్ ప్రసాద్ ప్రకటించారు. కార్యక్రమంలో వీవీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీనివాస్ ఆచార్య టి.విశ్వ విశ్వాని గ్రూప్ ప్రెసిడెంట్ జీఎస్ఎస్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ అడ్మిషన్స్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌రావు, డైరెక్టర్ డా.వై.లక్ష్మణ్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ వై.లక్ష్మణ్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు మొక్కలు, పక్షిగూళ్ల పంపిణీ

కాప్రా: పర్యావరణ, పక్షుల ప్రేమికుడు నంబూరి కృష్ణంరాజు ఆదివారం ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్లు పంపిణీ చేయనున్నారు. సొంత ఖర్చులతో తన ఇంటి పక్కనున్న ఖాళీ స్థలంలో మొక్కలు పెంచి, పక్షిగూళ్లు తయారు చేయించి పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు బాధ్యతగా ఉచితంగా పంపిణీ చేస్తుంటాడు. ఇందులో భాగంగానే ఇవాళ మారేడు, ఉసిరి, నేరేడు, పనస వంటి మొదలైన పండ్ల మొక్కలతో పాటు పక్షిగూళ్లను ఉచితంగా పంపిణీ చేస్తానని ఆయన తెలిపాడు. ఆసక్తిగల వారు కాప్రా హైటెన్షన్ లైన్ ఈశ్వరిపురి కాలనీలో తన నివాసం వద్దకు వచ్చి ఉచితంగా తీసుకోవాలని తెలిపారు. ఫోన్: 99891 83004.

చెత్త సేకరించే వాహనాలు సమయపాలన పాటించాలి



ఘట్‌కేసర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు సూచనలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య శనివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా 16వ వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలించి చెత్త సేకరణపై స్థానికులు, పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. చెత్తను కాల్వల్లో వేయడంతో మురుగు ఆగిపోయి రోడ్డుపైకి వస్తోందన్నారు. చెత్తను మున్సిపల్ కార్మికులకు అందజేసి స్వచ్ఛ ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. అనంతరం కార్మికుల హాజరు, పనివేళలు, తడి పొడి చెత్త సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్తను సేకరించే వాహనాలు సమయపాలన పాటించాలని, తద్వారా ప్రజలు ఆ సమయంలో చెత్తను సేకరించే వాహనంలో చెత్త వేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. దుకాణాదారులు తప్పకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముడోసారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ఆర్టీసీలో ప్రయాణించే వారికి నగదు ప్రోత్సాహకం

బోడుప్పల్: దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం నగదు ప్రోత్సాహకాలను అందించనున్నట్లు చెంగిచర్ల డిపో మేనేజర్ కవిత వెల్లడించారు. చెంగిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు, 28వ తేదీ నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు రూ.9,900 నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 29 వరకు టిక్కెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీఆర్ఎస్‌కు మూడోసారి అధికారం ఖాయం



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

కీసర: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం, సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నాగారం మున్సిపాలిటీలోని ల్యాండ్‌మార్క్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల బీఆర్ఎస్ నేతల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ నాయకులంతా కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు కొకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో సంబురాలు



ఉప్పల్: తెలంగాణ సాంప్రదాయ పండగ బతుకమ్మ పండగను ఉప్పల్ మినీ శిల్పారామంలో వేడుకగా జరుపుకున్నారు. శిల్పారామంలో నిర్వహించిన హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన సందర్శకులతో కిటకిటలాడింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ



శ్రీరంగవరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జవహర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ సతీమణి నాగరాణి, మహిళలు



మేడ్చల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చౌదరిగూడ కార్తికేయ కాలనీలో..



మేడ్చల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దమ్మాయిగూడ జర్నలిస్ట్ కాలనీలో..



నాగారం సెరినిటీ స్కూల్‌లో..





నాగారంలోని జీపీ కాలనీలో..



నాగారంలో..



జవహర్‌నగర్‌లో బతుకమ్మతో మేయర్ మేకల కావ్య



శ్రీరంగవరంలో బతుకమ్మతో చిన్నారులు



ఘట్‌కేసర్‌లో..

మేడ్చల్: తెలంగాణ మహిళలు అత్యంత ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండగ సంబరాలు మేడ్చల్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ పండగ సంబరాలు మొదటి రోజైన శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో, కాలనీల్లో మహిళలు పండగను జరుపుకున్నారు. పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అందులో గౌరమ్మను ఉంచి పూజలు చేశారు. ఇళ్ల ముందు, కూడళ్లలో గంటల తరబడి ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ.. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



చీర్యాల దేవాలయం వద్ద బతుకమ్మ ఉత్సవాలు



ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ పావనీయాదవ్